సాక్షి కామారెడ్డి


సోమవారం । 21 । ఆగస్టు । 2023



యూటర్న్‌కోసం రాస్తారోకో

జాతీయ రహదారిపైనుంచి తమ గ్రామానికి వెళ్లేందుకు యూటర్న్ ఏర్పాటు చేయాలంటూ అచ్చంపేటవాసులు ఆందోళన చేశారు.

- 8లో ▸



అన్ని పనులకు 'అతిథు'లే!

నస్రుల్లాబాద్‌లోని గిరిజన గురుకులంలో పోస్టులు ఖాళీగా ఉన్నాయి. గెస్ట్ టీచర్లతో బోధనేతర పనులూ చేయిస్తున్నారు.

- 8లో ▸

గరిష్టం/కనిష్టం 27.5 /21.1

వాతావరణం

ఉదయం చలిగాలులు వీస్తాయి. ఆకాశం పాక్షికంగా మేఘావృతమవుతుంది. అక్కడక్కడ ఓ మోస్తరు నుంచి భారీ వర్షాలు కురిసే అవకాశాలు ఉన్నాయి.

న్యూస్‌రీల్

అథ్లెటిక్స్ పోటీల్లో జిల్లాకు ఐదు పతకాలు



కామారెడ్డి అర్బన్: హైదరాబాద్‌లోని గోల్కొండ ఆర్టిలరీ సెంటర్‌లో ఆదివారం నిర్వహించిన రాష్ట్రస్థాయి మిడిల్, లాంగ్ డిస్టెన్స్ అథ్లెటిక్స్ పోటీల్లో జిల్లా క్రీడాకారులు సత్తాచాటారు. అండర్–20 విభాగంలో 800 మీటర్ల పరుగులో బి.అర్చన బంగారు, 3 వేల మీటర్ల పరుగులో కె.అనిల్ రజత పతకాలు సాధించారు. అండర్–18 విభాగంలో 800 మీటర్ల పరుగు పందెంలో ఎం.ఈశ్వర్ రజత, బి.హరిత కాంస్య పతకాలు పొందారు. అండర్–16 విభాగంలో రెండు వేల మీటర్ల పరుగు పందెంలో కేదార్ సింగ్ కాంస్య పతకం సాధించారు. క్రీడాకారులకు జిల్లా అథ్లెటిక్స్ అసోసియేషన్ అధ్యక్ష, ప్రధాన కార్యదర్శులు జైపాల్‌రెడ్డి, అనిల్‌కుమార్ అభినందనలు తెలిపారు.

జాతీయ హాకీ కోచ్‌గా బద్రి అనిల్‌కుమార్



కామారెడ్డి అర్బన్: ఆల్ ఇండియా ఎలక్ట్రిసిటీ స్పోర్ట్స్ కంట్రోల్‌బోర్డు 45వ జాతీయ హాకీ టోర్నమెంట్‌కు కోచ్‌గా కామారెడ్డికి చెందిన హాకీ క్రీడాకారుడు బద్రి అనిల్ కుమార్ ఎంపికయ్యారు. విద్యుత్ ఉద్యోగుల జాతీయ హాకీ టోర్నమెంట్ ఈనెల 22 నుంచి 25 వరకు ఆంధ్రప్రదేశ్ రాష్ట్రంలోని కాకినాడలో జరగనుంది.

రేపు జిల్లా స్థాయి యోగా పోటీలు

కామారెడ్డి అర్బన్: జిల్లాకేంద్రంలోని స్నేహపురి కాలనీలోగల ఎస్ఎస్‌వై యోగా కేంద్రంలో మంగళవారం జిల్లాస్థాయి యోగా పోటీలు నిర్వహించనునున్నారు. ఈ విషయాన్ని యోగాసన స్పోర్ట్స్ అసోసియేషన్ జిల్లా అధ్యక్షుడు గడ్డం రాంరెడ్డి ఆదివారం ఒక ప్రకటనలో తెలిపారు. సబ్ జూనియర్ అండర్ 9–14, జూనియర్ 14–18 విభాగాలలో బాలబాలికలకు వేరువేరుగా పోటీలు ఉంటాయని పేర్కొన్నారు. ఆసక్తిగల వారు వివరాలకోసం 94400 37948, 96664 70472 నంబర్లలో సంప్రదించాలని సూచించారు.

'ముదిరాజ్‌లకు అవకాశమివ్వాలి'



కామారెడ్డి అర్బన్: జిల్లాలో ఏదైనా ఒక అసెంబ్లీ స్థానాన్ని తమకు కేటాయించాలని ముదిరాజ్ మహాసభ జిల్లా అధ్యక్షుడు విఠల్ ముదిరాజ్ రాజకీయ పార్టీలను డిమాండ్ చేశారు. ఆదివారం జిల్లాకేంద్రంలోని పెద్దమ్మ ఆలయం వద్ద ముదిరాజ్ మహాసభ జిల్లా ప్లీనరీ నిర్వహించారు. జీవో 15 అమలు చేసి మత్స్య సంఘాల్లో సభ్యత్వం కల్పించాలని, రూ.వెయ్యికోట్లతో ముదిరాజ్ కార్పొరేషన్ ఏర్పాటు చేయాలని ప్రభుత్వాన్ని కోరారు. సమావేశంలో ముదిరాజ్ మహాసభ రాష్ట్ర కార్యవర్గ సభ్యుడు కనకయ్య, యువత ప్రధాన కార్యదర్శి జగన్, న్యాయవాదులు మంద రమేష్, గజ్జెల భిక్షపతి, నాయకులు లక్ష్మీనారాయణ, గంగరాజు, మహేష్, మురళి, శంకర్, మల్లేష్ పాల్గొన్నారు.

'ఇంజినీరింగ్ కళాశాల ఏర్పాటు చేయాలి'



భిక్కనూరు: భిక్కనూరులోని తెలంగాణ యూనివర్సిటీ సౌత్ క్యాంపస్‌లో ఇంజినీరింగ్ కళాశాలను ఏర్పాటు చేయాలని యూనివర్సిటీ డాక్టరేట్స్ అసోసియేషన్ అధ్యక్షుడు సంతోష్ గౌడ్ డిమాండ్ చేశారు. ఆదివారం ఆయన సౌత్ క్యాంపస్‌లో విలేకరులతో మాట్లాడారు. జిల్లా నుంచి ఏటా ఐదు వేల మంది విద్యార్థులు ఎంసెట్ పరీక్షకు హాజరవుతున్నారన్నారు. జిల్లాలో ఇంజినీరింగ్ కళాశాల లేకపోవడంతో ఇతర ప్రాంతాలకు వెళ్లాల్సి వస్తోందని పేర్కొన్నారు. జిల్లాలో ఇంజినీరింగ్ కళాశాల ఏర్పాటు చేస్తామని ప్రభుత్వ విప్ గంప గోవర్ధన్ హామీ ఇచ్చారని, దానిని నెరవేర్చాలని కోరారు. సమావేశంలో విద్యార్థి నేతలు ప్రేమ్‌చంద్, పవన్, కల్యాణ్, రాజ్ కుమార్, వినీత్, మహేశ్, కృష్ణ, మోహన్, జీవన్ తదితరులు పాల్గొన్నారు.

అదృష్టం ఎవరిదో..?



- నేడు మద్యం దుకాణాలకు లక్కీడ్రా
- 49 దుకాణాలకు 2,174 దరఖాస్తులు
- డ్రాలో రాకపోతే గుడ్‌విల్ ఇచ్చి తీసుకునేందుకూ రెడీ..

సాక్షి, కామారెడ్డి: మద్యం దుకాణాల టెండర్ల ప్రక్రియ కీలక దశకు చేరుకుంది. కలెక్టర్ జితేష్ వి పాటిల్ సమక్షంలో డ్రా ప్రక్రియ నిర్వహించేందుకు ఎక్సైజ్ శాఖ ఏర్పాట్లు చేసింది. సోమవారం జిల్లాకేంద్రంలోని రేణుకా గార్డెన్‌లో డ్రా ద్వారా దుకాణాలను కేటాయించనున్నారు.

కొత్త మద్యం పాలసీ డిసెంబర్ 1 నుంచి అములులోకి రావాల్సి ఉంది. అయితే ఎన్నికల నోటిఫికేషన్ వచ్చి టెండర్ల నిర్వహణకు ఇబ్బంది అవుతుందన్న ఉద్దేశంతో ప్రభుత్వం టెండర్ల ప్రక్రియను ముందుకు జరిపింది. జిల్లాలో ఐదు ఎక్సైజ్ సర్కిళ్ల పరిధిలో 49 మద్యం దుకాణాలున్నాయి. ఈనెల 4 నుంచి 18వ తేదీ వరకు టెండర్లు ఆహ్వానించారు. 2,174 మంది దరఖాస్తు చేసుకున్నారు. ఒక్కో దరఖాస్తు వెంట రూ.2 లక్షలు ఫీజుగా చెల్లించారు. ఇది నాన్ రిఫండబుల్.. ఇలా దరఖాస్తు ఫీజు ద్వారా సర్కారుకు రూ.43.48 కోట్ల ఆదాయం సమకూరింది. దుకాణాలను కేటాయించేందుకు సోమవారం డ్రా తీయనున్నారు. దరఖాస్తుదారుల సమక్షంలో డ్రా నిర్వహిస్తామని, ఈ ప్రక్రియ పూర్తి పారదర్శకంగా ఉంటుందని ఎక్సైజ్‌శాఖ అధికారులు తెలిపారు.

మహిళల పేరిట టెండర్లు..

మద్యం వ్యాపారంలో కూడా చాలామంది మహిళల పేరుతో టెండర్లు దాఖలు చేశారు. కొందరు వ్యాపారులు తమ భార్యల పేరిట దరఖాస్తు చేసుకున్నారు. 2021–23 లో నలభై మందికి పైగా టెండర్లలో పాల్గొనగా 11 దుకాణాలు దక్కాయి. ఈసారి వందమందికిపైగా మహిళల పేరుతో దరఖాస్తు చేసుకున్నట్లు తెలిసింది. కొందరు భార్య పేరుతో పాటు కూతుళ్లు, కుమారుల పేరుతోనూ టెండర్లు వేసి అదృష్టాన్ని పరీక్షించుకుంటున్నారు.

తీవ్ర పోటీ..

మద్యం దుకాణాల కోసం గతంలో ఎన్నడూ లేనంతగా పోటీ ఏర్పడింది. అత్యధికంగా నిజాంసాగర్ మండల కేంద్రంలోని మద్యం దుకాణానికి 88 దరఖాస్తులు రాగా.. ఇరవైలోపు దరఖా స్తులు వచ్చింది రెండు దుకాణాలకు మాత్రమే. మిగతా అన్ని షాపులకు 30కిపైగానే అప్లికేషన్లు దాఖలయ్యాయి. మద్యం వ్యాపారంలో ఉన్న వారితో పాటు కొత్తగా చాలామంది తమ అదృష్టాన్ని పరీక్షించుకుంటున్నారు. దరఖాస్తుదారులంతా తమకు దుకాణం దక్కుతుందోలేదో నని టెన్షన్‌లో ఉన్నారు. డ్రాలో దుకాణం దక్కకపోతే.. గుడ్ విల్ ఇచ్చి షాప్ తీసుకునేందుకూ పలువురు సిద్ధంగా ఉన్నారు. వచ్చేది ఎన్నికల ఏడాది కావడంతో దరఖాస్తులలాగే గుడ్‌విల్ కూడా భారీగా ఇవ్వాల్సి రావచ్చని భావిస్తున్నారు.

'మద్దెలచెరువు'కు మరోసారి!

జిల్లాలోని మద్యం దుకాణాల కేటాయింపు కోసం సోమవారం లక్కీ డ్రా తీయనుండగా.. మద్దెలచెరువు గ్రామంలోని షాప్‌ను మాత్రం పక్కనపెట్టారు. ఇక్కడ అత్యల్పంగా రెండు దరఖాస్తులు మాత్రమే వచ్చాయి. దీంతో ఉన్నతాధికారుల ఆదేశాల మేరకు ఈ దుకాణానికి లక్కీ డ్రా నిర్వహించడం లేదు. త్వరలో మళ్లీ టెండర్లు ఆహ్వానించి, దుకాణాన్ని కేటాయించే అవకాశాలున్నాయి.

దరఖాస్తుదారులు పాల్గొనాలి

కామారెడ్డి క్రైం: నూతన మద్యం పాలసీలో భాగంగా 2023–25 సంవత్సరానికిగాను జిల్లాలోని 49 మద్యం దుకాణాల కేటాయింపునకు సోమవారం డ్రా తీయనున్నట్లు జిల్లా ఎక్సైజ్ సూపరింటెండెంట్ రవీందర్ రాజు ఆదివారం ఒక ప్రకటనలో తెలిపారు. జిల్లాకేంద్రంలోని సిరిసిల్ల రోడ్డులోగల రేణుక ఎల్లమ్మ ఫంక్షన్ హాల్‌లో ఉదయం 11 గంటలకు లక్కీ డ్రా ప్రారంభమవుతుందని పేర్కొన్నారు. దరఖాస్తుదారులందరూ సోమవారం ఉదయం 10 గంటల వరకల్లా ఎంట్రీ పాసులతో ఫంక్షన్ హాల్‌కు చేరుకోవాలని సూచించారు. దరఖాస్తుదారుడు హాజరు కాకపోతే వారికి సంబంధించిన టోకెన్ డ్రాలో వేయబోమని పేర్కొన్నారు.

రాష్ట్రంలో ఏర్పడేది బీజేపీ ప్రభుత్వమే

- పార్టీ సిద్ధాంతాలను ప్రజల్లోకి తీసుకువెళ్లాలి
- అకల్‌కోట్ బీజేపీ ఎమ్మెల్యే సచిన్ కల్యాణ్ శెట్టి

కామారెడ్డి టౌన్: రాష్ట్రంలో వచ్చే అసెంబ్లీ ఎన్నికలలో గెలిచి బీజేపీ అధికారంలోకి రావడం ఖాయమని మహారాష్ట్రలోని అకల్‌కోట్ నియోజకవర్గ ఎమ్మెల్యే సచిన్ కల్యాణ్ శెట్టి ఆశాభావం వ్యక్తం చేశారు. ఎమ్మెల్యే ప్రవాస్ యోజనలో భాగంగా జిల్లా కేంద్రంలోని లక్ష్మీదేవి గార్డెన్స్‌లో ఆదివారం నిర్వహించిన వర్క్ షాప్‌లో ఆయన పాల్గొన్నారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ కేంద్ర ప్రభుత్వం ప్రవేశపెట్టిన సంక్షేమ పథకాలను జిల్లాలో ప్రతి గడపకు తీసుకువెళ్లాలని శ్రేణులకు సూచించారు. బీజేపీ సిద్ధాంతాలను ప్రజల్లోకి తీసుకెళ్లాల్సిన బాధ్యత ప్రతి ఒక్కరిపై ఉందన్నారు. నియోజకవర్గంలోని ప్రతి బూత్‌లో కనీసం 50 మంది కార్యకర్తలను తయారు చేసుకోవాలని సూచించారు. ఎప్పుడూ ప్రజల మధ్య ఉండాలన్నారు. ప్రజల సమస్యలను తెలుసుకుని వాటి పరిష్కారానికి కృషి చేయాలన్నారు. బీఆర్ఎస్ పాలనలో అన్ని వర్గాల ప్రజలు ఇబ్బందులు ఎదుర్కొంటున్నారన్నారు. పాలకులు రాష్ట్ర ఖజానాను దోచుకుని, తెలంగాణను అప్పుల కుప్పగా మార్చారని ఆరోపించారు. గొప్పలు చెప్పుకోవడమే బీఆర్ఎస్ పని అన్నారు. మహారాష్ట్రలో బీఆర్ఎస్‌కు అసలు ఆదరణే లేదన్నారు. తెలంగాణఅభివృద్ధి ప్రధాని మోదీతోనే సాధ్యమన్నారు. కార్యక్రమంలో బీజేపీ రాష్ట్ర నాయకుడు మురళీధర్‌గౌడ్, రాష్ట్ర కార్యవర్గ సభ్యుడు నీలం రాజులు, బీజేపీ అసెంబ్లీ ఇన్‌చార్జి వెంకటరమణారెడ్డి, మున్సిపల్ ఫ్లోర్ లీడర్ మోటూరి శ్రీకాంత్, కౌన్సిలర్ శ్రీనివాస్, నాయకులు తేలు శ్రీనివాస్, లక్ష్మారెడ్డి పాల్గొన్నారు.



మాట్లాడుతున్న అకల్‌కోట్ ఎమ్మెల్యే సచిన్ కల్యాణ్ శెట్టి

'క్రమబద్ధీకరించే వరకు సమ్మె చేస్తాం'

కామారెడ్డి టౌన్: తమ ఉద్యోగాలను క్రమబద్ధీకరించేంత వరకు సమ్మెను కొనసాగిస్తామని వైద్య ఆరోగ్యశాఖలో విధులు నిర్వహిస్తున్న రెండో ఏఎస్ఎంలు స్పష్టం చేశారు. నోటిఫికేషన్ రద్దు చేసి క్రమబద్ధీకరించాలని డిమాండ్ చేస్తూ ఏఎన్ఎంలు చేపట్టిన సమ్మె ఆదివారం ఆరో రోజు కొనసాగింది. ఆర్డీవో కార్యాలయం వద్ద ఏర్పాటు చేసిన సమ్మె శిబిరంలో ఏఎన్ఎంలు నిరసన తెలిపారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ తమకు వెయిటేజీ మార్కులు, పోస్టుల పెంపు ఆశచూపి సమ్మెను నిర్వీర్యం చేయాలని చూస్తున్నారని మండిపడ్డారు. తమను రెగ్యులర్ చేయడం సాధ్యం కాదన్న డీహెచ్ శ్రీనివాస్ వ్యాఖ్యలపై ఆగ్రహం వ్యక్తం చేశారు. ఇతర ప్రభుత్వ శాఖలలో కాంట్రాక్ట్ ఉద్యోగులను ఎలా రెగ్యులరైజ్ చేశారని ప్రశ్నించారు. సమ్మెలో సీఐటీయూ పట్టణ అధ్యక్షుడు రాజనర్సు, ఏఎన్ఎంలు దీవెన, రేణుక, లక్ష్మి తదితరులు పాల్గొన్నారు.



సమ్మెలో పాల్గొన్న ఏఎన్ఎంలు

'రాజీవ్ గాంధీ కృషితోనే అభివృద్ధి'



జిల్లా కేంద్రంలో రాజీవ్‌గాంధీ విగ్రహం వద్ద నివాళులు అర్పిస్తున్న షబ్బీర్ అలీ, కాంగ్రెస్ నాయకులు


కామారెడ్డి టౌన్: మాజీ ప్రధాని రాజీవ్ గాంధీ కృషితో దేశం అభివృద్ధి పథంలో పయనించిందని మాజీ మంత్రి షబ్బీర్ అలీ పేర్కొన్నారు. ఆదివారం జిల్లా కేంద్రంలోని పార్టీ కార్యాలయంలో రాజీవ్ గాంధీ జయంతిని నిర్వహించారు. నిజాంసాగర్ చౌరస్తాలో ఆయన విగ్రహానికి పూలమాలలు వేసి నివాళులు అర్పించారు. ఈ సందర్భంగా షబ్బీర్ అలీ మాట్లాడుతూ యువతకు 18 ఏళ్లకే ఓటు హక్కు కల్పించిన ఘనత రాజీవ్ గాంధీదేనన్నారు. ఆయన గ్రామ పంచాయితీలను బలోపేతం చేశారన్నారు. మహిళలకు రిజర్వేషన్లు కల్పించడం, టెలికాం రంగంలో మార్పులు, ఐటీ రంగం అభివృద్ధి ఆయనతోనే సాధ్యమయ్యాయన్నారు. కార్యక్రమంలో కాంగ్రెస్ పట్టణ అధ్యక్షుడు పండ్ల రాజు, నాయకులు శ్రీనివాస్, అశోక్‌రెడ్డి, సందీప్, నౌసీలాల్, వైద్య కిషన్‌రావు, పాత శివ కృష్ణమూర్తి, శేఖర్, ఖుర్షీద్, ముకుందం, గంగాధర్ తదితరులు పాల్గొన్నారు.

షబ్బీర్ అలీకి సన్మానం

జిల్లా కేంద్రంలో ఆదివారం వస్త్ర వర్తక సంఘం ప్రతినిధులతో మాజీ మంత్రి షబ్బీర్ అలీ సమావేశమయ్యారు. వర్తకులు తమ సమస్యలను ఆయన దృష్టికి తీసుకువెళ్లారు. ఈ సందర్భంగా షబ్బీర్ అలీ మాట్లాడుతూ కాంగ్రెస్ గెలుపునకు కృషి చేయాలని వర్తకులను కోరారు. కాంగ్రెస్ అధికారంలోకి రాగానే సంఘ భవనం, శుభకార్యాలు జరుపుకోవడానికి భవనం నిర్మాణానికి సహాయం చేస్తానన్నారు. కార్యక్రమంలో వస్త్ర వర్తక సంఘం ప్రతినిధులు నర్సింలు, శేఖర్ తదితరులు పాల్గొన్నారు.

ఆ ఫైల్ కదలికలో మతలబేంది!

- 2014 నియామకాల పదోన్నతులపై అంత ఆసక్తి ఎందుకో?
- గతంలో ఈసీ సమావేశాల్లో తిరస్కరించినా.. మరోసారి ప్రతిపాదనలు
- ఈసీ మళ్లీ తిరస్కరించినప్పటికీ ఆగని రిజిస్ట్రార్ యాదగిరి ప్రయత్నాలు



సాక్షి ప్రతినిధి, నిజామాబాద్ : తెలంగాణ విశ్వవిద్యాలయంలో 2014 లో నియామకమైన అధ్యాపక బృందానికి సంబంధించి కెరీర్ అడ్వాన్స్‌మెంట్ స్కీం కింద పదోన్నతుల అంశాన్ని పాలకమండలి అనేకసార్లు తిరస్కరించినప్పటికీ తాజాగా ఆ ఫైల్‌ను మూవ్ చేస్తుండడం విస్మయానికి గురిచేస్తోంది. కోర్టులో ఉండడంతో పదోన్నతుల విషయమై ముందుకు వెళ్లాల్సిన అవసరం కూడా లేదని పాలకమండలి తేల్చింది. అయినప్పటికీ ప్రస్తుత రిజిస్ట్రార్ యాదగిరి దీన్ని మెల్లగా కదుపుతున్నారు. 2014లో అప్పటి వీసీ అక్బర్ అలీఖాన్ అధ్యాపకులను నియమించారు. ఇవి చెల్లవని 41వ ఈసీ సమావేశంలో తీర్మానించడంతో పాటు క్రిమినల్ కేసు పెట్టాలని నిర్ణయించారు. పైగా ఈ నియామకాలకు వ్యతిరేకంగా కాంట్రాక్ట్ అధ్యాపకులు కోర్టుకు వెళ్లారు. రాష్ట్ర ప్రభుత్వం ప్రసాదరావు, భాస్కర్‌రావు అనే ఇద్దరు ప్రొఫెసర్లతో ద్విసభ్య కమిటీ వేసింది. అప్పటి గవర్నర్ నరసింహన్ సైతం సీవీ రాములు కమిటీ వేశారు. ఈ రెండు కమిటీలు నియామకాలు అక్రమమని నివేదికలు ఇచ్చాయి. ఈ క్రమంలో వ్యవహారం కోర్టులో ఉన్నందున 43, 45, 48, 53 ఈసీ సమావేశాల్లో 2014 నియామకాల ప్రమోషన్ల ను తిరస్కరించారు. రవీందర్‌గుప్తా వీసీగా ఉన్న సమయంలో రూ.2 కోట్లతో డీల్ కుదుర్చుకుని ఫైల్ కదిపినట్లు తెలియడంతో గందరగోళం నెలకొంది. ఇతర అవకతవకలు, అక్రమ నియామకాల నేపథ్యంలో వర్సిటీ పరువు బజారుపాలైంది. ఈ క్రమంలోనే వీసీ రవీందర్‌గుప్తా ఏసీబీకి చిక్కారు. దీంతో రాష్ట్ర ప్రభుత్వం ఇన్‌చార్జి వీసీగా ఐఏఎస్ అధికారి వాకాటి కరుణను నియమించింది.

పాలకమండలి తీర్మానాన్ని బేఖాతరు చేస్తూ..

యూనివర్సిటీని ప్రక్షాళన చేసేదాంట్లో భాగంగా పాలకమండలి గట్టి యుద్ధమే చేసింది. గత వీసీ, రిజిస్ట్రార్ల అక్రమాలపై విజిలెన్స్ విచారణకు సైతం తీర్మానించారు. ఆ విచారణ నడుస్తోంది. పాలక మండలి సభ్యులు యాదగిరిని ఏరికోరి రిజిస్ట్రార్‌గా నియమించారు. తాజాగా ఈనెల 10న హైదరాబాద్‌లో 62వ పాలకమండలి సమావేశం జరిగింది. 2014 నియామకాలు, వివాదాల గురించి క్షుణ్ణంగా తెలిసిన యాదగిరి మళ్లీ వాటికి సంబంధించిన ప్రమోషన్ల విషయమై ఎజెండాలో పెట్టారు. ఈసీ సభ్యులు తిరస్కరించినప్పటికీ ప్రమోషన్ల అంశంపై లీగల్ ఒపీనియన్‌కు పంపాలని ఇన్‌చార్జి వీసీ వాకాటి కరుణ నిర్ణయించారు. ప్రస్తుత ఇన్‌చార్జి వీసీ అయిన ఆమె గతంలో ఉన్నత విద్యాశాఖ ప్రిన్సిపల్ సెక్రటరీ హోదాలో పాలకమండలి సమావేశాలకు హాజరయ్యారు. సమావేశాల్లో వాకాటి కరుణ సైతం ఈ ప్రమోషన్ల వ్యవహారాన్ని అప్పటి ఉన్నత విద్యాశాఖ కమిషనర్ నవీన్ మిట్టల్‌తో కలిసి తిరస్కరించారు. 53వ ఈసీ సమావేశంలో సైతం తిరస్కరించిన సమయంలో రిజిస్ట్రార్‌గా యాదగిరి ఉన్నారు. అయినప్పటికీ యాదగిరి కొందరు 2014 బ్యాచ్ అధ్యాపకులతో ఇన్‌చార్జి వీసీ వాకాటి కరుణకు వినతిపత్రం ఇప్పించినట్లు తెలిసింది. ఈ నేపథ్యంలో తాజాగా ఈ వివాదాస్పద నియామకాల ప్రమోషన్ల ఫైల్‌ను మూవ్ చేస్తుండడంపై వర్సిటీ వర్గాలు అనుమానాలు వ్యక్తం చేస్తున్నాయి.

సబితమ్మా.. మొర వినవమ్మా..

- మండలానికో జూనియర్ కళాశాల ఏర్పాటు చేయాలంటున్న విద్యార్థులు
- పిట్లంలో డిగ్రీ కళాశాల ఏర్పాటుకు డిమాండ్
- నేడు పెద్దకొడప్‌గల్‌కు విద్యాశాఖ మంత్రి సబితా ఇంద్రారెడ్డి రాక



పెద్దకొడప్‌గల్‌లో ప్రారంభోత్సవానికి ముస్తాబైన అదనపు తరగతి గదులు

నిజాంసాగర్: రాష్ట్ర సరిహద్దుల్లో ఉన్న మారుమూల నియోజకవర్గమైన జుక్కల్‌లో ఇంటర్ కళాశాలలు అందుబాటులో లేకపోవడంతో విద్యార్థులు ఇబ్బందులు పడుతున్నారు. ప్రైవేట్ కళాశాలల్లో చేరేందుకు ఆర్థిక స్థోమత సరిపోక పలువురు మధ్యలోనే చదువు మానేయాల్సిన పరిస్థితి నెలకొంది. విద్యాశాఖ మంత్రి స్పందించి మండలానికో ఇంటర్ కళాశాల మంజూరు చేయాలని నియోజకవర్గ ప్రజలు కోరుతున్నారు.

జుక్కల్ నియోజకవర్గంలోని నిజాంసాగర్, పెద్దకొడప్‌గల్, డోంగ్లి మండలాల్లో ప్రభుత్వ జూనియర్ కళాశాలలు లేవు. నిజాంసాగర్ మండలంలోని మల్లూర్, అచ్చంపేట, నిజాంసాగర్, మహమ్మద్‌నగర్, కొమలంచ, గాలిపూర్, సింగితం గ్రామాల్లో ప్రభుత్వ ఉన్నత పాఠశాలలు ఉన్నాయి. ఆయా ఉన్నత పాఠశాలల్లో ఏటా 550 మంది వరకు పదో తరగతి పూర్తి చేస్తున్నారు. పెద్దకొడప్‌గల్ మండల కేంద్రంతో పాటు వడ్లం, కాటేపల్లి గ్రామాల్లోగల ఉన్నత పాఠశాలల నుంచి ఏటా 300 మంది వరకు పదో తరగతి ఉత్తీర్ణులవుతున్నారు. ఇటీవల కొత్తగా ఏర్పాటైన డోంగ్లి మండలంలో పదో తరగతి పూర్తి చేసినవారు మద్నూర్‌కు వెళ్లి ఇంటర్ చదువుతున్నారు. నిజాంసాగర్, పెద్దకొడప్‌గల్ మండలాలలో ప్రభుత్వ జూనియర్ కళాశాల అందుబాటులో లేకపోవడంతో బాన్సువాడ, ఎల్లారెడ్డి పట్టణాలకు వెళ్లాల్సిన పరిస్థితి ఉంది.

డిగ్రీ కళాశాల ఏర్పాటయ్యేనా?

పిట్లం మండల కేంద్రంలో ప్రభుత్వ డిగ్రీ కళాశాల ఏర్పాటు కలగానే మారింది. పిట్లంలో కళాశాల ఏర్పాటు చేస్తే నిజాంసాగర్, పెద్దకొడప్‌గల్ మండలాలలోని పేద విద్యార్థులకు డిగ్రీ చదవడానికి అనుకూలంగా ఉంటుంది. ఆయా మండలాలకు ప్రభుత్వ జూనియర్ కళాశాలలు మంజూరు చేయడంతోపాటు పిట్లంలో డిగ్రీ కళాశాల ఏర్పాటు చేయాలని విద్యార్థులు కోరుతున్నారు.

విజయవంతం చేయండి..

విద్యాశాఖ మంత్రి సబితా ఇంద్రారెడ్డి సోమవారం పిట్లంలో పర్యటించనున్నారు. మన ఊరు.. మనబడి కార్యక్రమంలో భాగంగా నిర్మించిన అదనపు తరగతి గదులను ఆమె ప్రారంభిస్తారు. కార్యక్రమాన్ని విజయవంతం చేయాలని జుక్కల్ ఎమ్మెల్యే హన్మంత్ సింధే ప్రజలను కోరారు.

క్లుప్తంగా

ఊర పందుల స్వైర విహారం



తాడ్వాయి(ఎల్లారెడ్డి): మండల కేంద్రంతో పాటు పలు గ్రామాలలో ఊర పందులు స్వైర విహారం చేయడంతో ప్రజలు తీవ్ర ఇబ్బందులకు గురవుతున్నారు. గుంపులు–గుంపులుగా వీధులలో తిరగడంతో పాటు ఇంటి ముందర ఉన్న సామగ్రిని చిందర వందర చేస్తున్నాయని గ్రామస్తులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. అధికారులు, ప్రజాప్రతినిధులకు ఎన్నిసార్లు చెప్పినా పట్టించుకోవడం లేదని వాపోతున్నారు. తాడ్వాయి, కృష్ణాజీవాడి, దేమికలాన్, ఎర్రాపహాడ్ తదితర గ్రామాలలో పందులు అధికంగా తిరుగుతున్నాయన్నారు. ఇప్పటికైనా అధికారులు, ప్రజాప్రతినిధులు పట్టించుకొని పెంపకందారులతో మాట్లాడి పందులు తిరగకుండా చర్యలు తీసుకోవాలని ఆయా గ్రామాల ప్రజలు కోరుతున్నారు.

మార్కెట్‌కు పంచమి సందడి



మద్నూర్(జుక్కల్): నాగపంచమి సందర్భంగా మండల కేంద్రంలోని మార్కెట్‌కు సందడి వాతావరణం వచ్చింది. రెండు రోజుల నుంచి దుకాణాలు కొనుగోలుదారులతో కళకళలాడుతున్నాయి. చుట్టు పక్కల గ్రామాల నుండి యువతులు, మహిళలు మండల కేంద్రాల్లో కొత్త బట్టలు, మెహెందీ, గాజులు కొనుగోలు చేస్తుండడంతో పండగ వాతావరణం నెలకొంది.

ఊరూరా ప్యాలాల బట్టీలు



తాడ్వాయి(ఎల్లారెడ్డి): మండల కేంద్రంతో పాటు వివిధ గ్రామాలలో ప్యాలాల బట్టీలను ఏర్పాటు చేశారు. ప్రతి ఏడాది మాదిరిగానే ఈ యేడు కూడా నాగుల పంచమి పండుగ సందర్భంగా గ్రామాలలోని ప్రధాన కూడలిలో బట్టీలను ఏర్పాటు చేశారు. మహిళలు జొన్నలు, మక్కలు, శనిగలు, ఉలువలను బట్టీల దగ్గరకు తీసుకెళ్లి వాటిని ప్యాలాలుగా మార్చుకుంటున్నారు. ఈనెల 21న నిర్వహించే నాగుల పంచమి పండుగ రోజున మహిళలు గ్రామ శివారులో ఉన్న ఆలయాలు, పాము పుట్టల వద్దకు వెళ్లి ఆవు పాలతో పాటు ప్యాలాలను వేసి పూజిస్తారు.

అంగట్లో ఆడపిల్ల

రామారెడ్డి మండలంలోని అన్నారం పీహెచ్‌సీ పరిధిలోని ఓ తండాలో ఆడపిల్లకు జన్మనిచ్చిన తల్లి ఆస్పత్రి నుంచి డిశ్చార్జ్ అయిన వెంటనే నిజామాబాద్‌లో నివసించే దంపతులకు అమ్మేసింది. దీనిని పసిగట్టిన అంగన్‌వాడీ సిబ్బంది ఐసీపీఎస్, పోలీసులకు ఫిర్యాదు చేయడంతో వారం తర్వాత ఆ పసి పాపను నిజామాబాద్‌లో గుర్తించారు. రామారెడ్డి పోలీస్‌స్టేషన్‌లో తల్లికి బిడ్డను అప్పగిస్తే ఆమె బిడ్డను తీసుకునేందుకు నిరాకరించింది. చివరికి చిన్నారిని నిజామాబాద్‌లోని శిశుగృహకు తరలించారు.

- నిరుపేద కుటుంబాలే లక్ష్యంగా దందా
- ఆస్పత్రుల్లోనే కొనసాగుతున్న బేరసారాలు
- అధికారుల తనిఖీలతో వెలుగులోకి వస్తున్న ఘటనలు
- అవగాహన కల్పించినా మారని తల్లిదండ్రులు



స్వాధీనం చేసుకున్న బిడ్డతో ఐసీపీఎస్ సిబ్బంది, పోలీసులు (ఫైల్)

రామారెడ్డి: జిల్లాలో శిశువుల క్రయవిక్రయాలు గుట్టుచప్పుడు కాకుండా జోరుగా సాగుతున్నాయి. కొందరు దళారుల పాత్ర పోషించి శిశువుల అమ్మకాల దందాను ప్రోత్సహిస్తున్నట్లు తెలుస్తోంది. నిరుపేద కుటుంబాలే లక్ష్యంగా చేసుకుని ఈ వ్యవహారాన్ని నడిపిస్తున్నారు. కామారెడ్డి జిల్లా కేంద్రంలో సవతి తల్లి సంతలో పశువులను విక్రయించినట్లు తన చిన్న కుమార్తెను రూ. 80 వేలకు, పెద్ద కుమార్తెను రూ. 50 వేలకు విక్రయించి వదిలించుకునేందుకు ప్రయత్నం చేసింది. దీంతో ఆ మైనర్ బాలికలు పోలీసులను ఆశ్రయించడంతో సవతి తల్లి, తండ్రితో పాటు మరో ఐదుగురిపై పోక్సో యాక్ట్ కింద కేసు నమోదు చేశారు. జిల్లాలో మారుమూల పల్లెలు, తండాల్లో నిరుపేదలే లక్ష్యంగా దళారులు రంగప్రవేశం చేసి డబ్బు ఆశ చూపి అభం శుభం తెలియని ఆ చిన్నారులను చట్టవిరుద్ధంగా అమ్ముతున్నారు.

అంగన్‌వాడీ టీచర్ల నిఘా ఉన్నా..

ఏ గ్రామంలోనైనా ఓ మహిళ గర్భం దాలిస్తే ఆ ప్రాంతంలోని అంగన్‌వాడీలు, ఆశ కార్యకర్తలకు సమాచారం తీసుకుని వారికి ఆరోగ్య పరీక్షలు చేయిస్తుంటారు. గర్భవతి వివరాలు అంగన్‌వాడీల్లో నమోదు చేసి గర్భిణికి, అనంతరం బాలింతకు పోషకాహారం అందిస్తారు. కాని కొందరు ముందే దళారులతో ఒప్పందం చేసుకుని గర్భం దాల్చినప్పటికీ వివరాలు నమోదు చేయించకుండా వేరే ఊళ్లో ఉంటూ పుట్టిన బిడ్డను అమ్ముకుంటున్నారు. ఎక్కువగా జిల్లాలో మారుమూల గ్రామాలు, పల్లె, తండాల్లో శిశువుల అమ్మకాలు కొనసాగుతున్నాయి. చట్ట విరుద్ధంగా పిల్లలను అమ్మడం నేరం అని తెలిసినా చట్టం, అధికారుల కళ్లు గప్పి బిడ్డను రూ.లక్ష నుంచి రూ. 2 లక్షల వరకు తీసుకుని అమ్ముకుంటున్నారు. వచ్చిన డబ్బులో 50 శాతం మధ్యవర్తిగా వ్యవహరించిన వ్యక్తే తీసుకుంటున్నప్పటికీ వచ్చిన డబ్బులు తీసుకుని బిడ్డను అప్పగించేస్తున్నారు. ఎక్కడైనా డబ్బు పంపిణీలో వివాదం ఏర్పడినప్పుడే ఇలాంటి ఘటనలు వెలుగు చూస్తున్నాయి. మరోవైపు అంగన్‌వాడీ, ఆశవర్కర్ల సిబ్బంది వల్ల కూడా పుట్టిన బిడ్డ కనిపించకపోవడంతో ఐసీడీఎస్ సిబ్బందికి ఫిర్యాదు చేస్తున్నారు.

చట్ట వ్యతిరేకమని తెలిసినా..

పిల్లలు లేని వారు చిన్నారులను అమ్మడం, కొనుగోలు చేయడం చట్టవిరుద్ధం అని తెలిసినా గోప్యంగా కొనుగోలు చేయడానికే ఆసక్తి చూపుతున్నారు. చట్ట ప్రకారం 'కారా' ద్వారా దరఖాస్తులు చేసుకోవడం, శిశుగృహ నుంచి పిల్లలను చట్ట ప్రకారం దత్తత తీసుకోవడం ఆలస్యం అవుతుండడంతో పిల్లల కోసం కొందరు తప్పుడు మార్గాలను ఎంచుకుంటున్నారు.

అవగాహన కల్పిస్తున్నాం..



శిశువుల అమ్మకాలు చేస్తే అంగన్‌వాడీ, ఆశ కార్యకర్తలు వెంటనే గుర్తించే వ్యవస్థ ఉంది. అలా గుర్తించి ఇటీవలే అప్పుడే పుట్టిన ఆడ పిల్లలను పోలీసులు, ఐసీడీఎస్ సిబ్బంది ద్వారా రికవరీ చేసి, తల్లికి అప్పగించాం. ప్రత్యేకంగా సమావేశం నిర్వహించి అవగాహన కల్పిస్తున్నాం. – ఉమాదేవి, అంగన్‌వాడీ సూపర్‌వైజర్, రామారెడ్డి

అన్ని పనులకు అతిథి ఉపాధ్యాయులే

- పని భారంతో ఇబ్బందులు పడుతున్న వైనం
- నామ మాత్రపు విధుల్లో రెగ్యులర్ ఉపాధ్యాయులు
- 20 ఏళ్లుగా విధుల్లో ఉన్నా రెగ్యులరైజ్ కాలేదని ఆవేదన

నస్రుల్లాబాద్(బాన్సువాడ): గురుకుల పాఠశాలలో ఉదయం నుంచి అర్ధ రాత్రి వరకు అన్ని పనులు అతిథి ఉపాధ్యాయులే చేయాల్సి ఉంది. బోధనతో పాటు హౌజ్ మాస్టర్, కేర్ టేకర్, డిప్యూటీ వార్డెన్, సూపర్ వైజర్(స్టడీస్), నైట్ స్టే వంటి పనులు చేయడానికి అతిథి ఉపాధ్యాయులే కీలకం. అయినా తమ కష్టానికి తగిన వేతనం కాని గుర్తింపు కాని లభించడం లేదని వాపోతున్నారు. వారికి కేటాయించిన పని నిర్వహణలో ఏ మాత్రం తేడా వచ్చినా పనిష్మెంట్ తప్పడం లేదు. శారీరక శ్రమతో పాటు మానసికంగా రెగ్యులర్ ఉపాధ్యాయుల వేధింపులకు గురవుతున్నారు. 20 ఏళ్లుగా ఉద్యోగం చేస్తున్నా కూడా చాలీ చాలని వేతనాలతో జీవితం వెళ్లదీస్తున్నారు. ప్రభుత్వం తమ గోడు పట్టించుకోవడం లేదని ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. గిరిజన గురుకుల పాఠశాలలో పని భారం తీవ్రంగా ఉంటుంది. రెగ్యులర్ ఉపాధ్యాయులు సమయ పాలన పాటించకుండా ఇష్టారీతిన వ్యవహరిస్తుంటారన్న ఆరోపణలు కూడా ఉన్నాయి.

రెగ్యులరైజ్ చేయాలి



20 ఏళ్లుగా పని చేస్తున్న వారు ఉన్నారు. ఉపాధ్యాయ పోస్టుల భర్తీల్లో తమకు కొంత ప్రత్యేకత కల్పించాలి. అతిథి ఉపాధ్యాయులను వెంటనే రెగ్యులరైజ్ చేయాలని కోరుతున్నాం. – మున్ని రాథోడ్, గురుకుల బాలుర పాఠశాల, నస్రుల్లాబాద్

సమస్యలను పరిష్కరించాలి



అతిథి ఉపాధ్యాయులపై పని భారం తగ్గించాలి. గురుకుల పరీక్షల్లో మాకు వెయిటేజీ ఇవ్వాలి. ఉదయం 9.30 గంటల నుంచి 4.00 గంటల వరకు మాత్రమే విధుల్లో ఉండేలా చూడాలి. పనికి తగిన వేతనం అందించాలని కోరుతున్నాం. – పెర్క భాస్కర్, అతిథి ఉపాధ్యాయ సంఘం ఉమ్మడి నిజామాబాద్ జిల్లా అధ్యక్షుడు

యూటర్న్ కోసం గ్రామస్తుల రాస్తారోకో



నాందేడ్- సంగారెడ్డి రహదారిపై బైఠాయించి ఆందోళన చేస్తున్న అచ్చంపేట గ్రామస్తులు

నిజాంసాగర్ (జుక్కల్): నాందేడ్–సంగారెడ్డి జాతీయ రహదారి నుంచి తమ గ్రామానికి వెళ్లేందుకు యూటర్న్‌ను ఏర్పాటు చేయాలని కోరుతూ ఆదివారం అచ్చంపేట గ్రామస్తులు ధర్నా, రాస్తారోకో చేశారు. తమ గ్రామానికి వెళ్లడానికి యూటర్న్ సదుపాయం లేక అష్టకష్టాలు పడుతున్నామని వారు ఆందోళన వ్యక్తం చేశారు. యూటర్న్‌ను ఏర్పాటు చేయాలని గతంలో ధర్నా, రాస్తారోకో చేసినా నేషనల్ హైవే అధికారులు పట్టించుకోవడం లేదని వాపోయారు. యూటర్న్‌ను ఏర్పాటు చేసేంత వరకు రాస్తారోకో విరమించేది లేదని వారు మొండి కేశారు. దీంతో భారీగా ట్రాఫిక్ జామైంది. విషయం తెలుసుకున్న నేషనల్ హైవే అధికారులు ఘటన స్థలానికి చేరుకొని ఆందోళన చేస్తున్న గ్రామ పెద్దలతో చర్చించారు. యూటర్న్ కోసం జీపీ తీర్మానాన్ని జిల్లా కలెక్టర్‌కు, నేషన్ హైవే అధికారులకు ఇవ్వాలని సూచించారు. వారం, పదిహేను రోజుల్లో యూటర్న్‌ను ఏర్పాటు చేస్తామని చెప్పడంతో ఆందోళన విరమించారు.

అర్హులందరికీ పోడు పట్టాలివ్వాలి



మాచారెడ్డిలో మాట్లాడుతున్న బీజేపీ జిల్లా ఉపాధ్యక్షుడు పొన్నాల వెంకట్ రెడ్డి

మాచారెడ్డి: భూమిలేని పేదలకు ప్రభుత్వం మానవతా దృక్పథంతో ఆలోచించి పోడు పట్టాలు అందజేయాలని బీజేపీ జిల్లా ఉపాధ్యక్షుడు పొన్నాల వెంకట్ రెడ్డి డిమాండ్ చేశారు. ఈ మేరకు ఆయన ఆదివారం మాచారెడ్డిలో విలేకరులతో మాట్లాడారు. ఎన్నో ఏళ్లుగా పోడు భూమిని నమ్ముకొని జీవిస్తున్న అక్కాపూర్, ఎల్లంపేట, సోమారంపేట, బంజపల్లి గ్రామాల రైతులపై అటవీ అధికారులు కేసులు పెడుతూ వేధింపులకు గురి చేస్తున్నారని ఆవేదన వ్యక్తం చేశారు. మూడు తరాల నుంచి పోడు వ్యవసాయం చేస్తున్న వాళ్లందరికి పట్టాలిస్తామని హామీ ఇచ్చి ప్రభుత్వం చేతులెత్తేసిందని ఆరోపించారు. బీజేపీ మండల శాఖ అధ్యక్షుడు వడ్ల నర్సింహస్వామి, ఓబీసీ జిల్లా ఉపాధ్యక్షులు తోట బాలరాజు, నాయకులు సురేష్ స్వామి, అంకం హారిక, గడ్డం రామస్వామి, తదితరులు ఉన్నారు.

జన్మభూమి రోడ్డు గుంతలమయం



కామారెడ్డి రూరల్: జిల్లా కేంద్రంలోని జన్మభూమి రోడ్డు గుంతలమయంగా మారింది. వర్షానికి గుంతల్లో నీరు నిల్చి గుంతలు ఏర్పడకపోవడంతో ప్రమాదాలు జరుగుతున్నాయి. ఈ రోడ్డు గుండా రాకపోకలు అధికంగా ఉంటాయి. అయినా మున్సిపల్ పాలక వర్గం, అధికారులు పట్టించుకోకపోవడం శోచనీయమం. గుంతలను పూడ్చి ప్రమాదాలు జరగకుండా చూడాలని పట్టణ ప్రజలు కోరుతున్నారు.

గిజిగాడి గూడు అదుర్స్..!

- ఇంజినీరు నైపుణ్యంతో గూళ్లు కట్టుకుంటున్న పిచ్చుకలు



నాగిరెడ్డిపేట(ఎల్లారెడ్డి): గిజిగాడి గూళ్లు చూడముచ్చటగా ఉన్నాయి. ప్రకృతిలో భాగంగా గిజిగాడి పిచ్చుకలు ఎంతో గొప్ప ఇంజనీరు నైపుణ్యంతో గూళ్లను పేర్చుకుంటున్నాయి. ఒక్కో గడ్డిపోచను తీసుకొచ్చి అల్లుకుంటూ చూడముచ్చటగా గూళ్లను కట్టుకుంటున్నాయి.

కమీషన్ కాదు.. చేబదులే..

- కల్యాణలక్ష్మి, షాదీముబారక్ లబ్ధిదారుల వద్ద నాయకుల వసూళ్లు
- తిరిగిస్తామని చెబుతూ ఎగ్గొడుతున్న ప్రజాప్రతినిధులు
- నష్టపోతున్న లబ్ధిదారులు



మోర్తాడ్(బాల్కొండ): 'మీ కూతురి పెళ్లి చేస్తే మీకు కల్యాణలక్ష్మి, షాదీ ముబారక్ చెక్కు ఇప్పించాం కదా నాకు కొంత ఇబ్బందిగా ఉంది ఒక రూ. 10 వేలు ఉంటే చేబదులుగా ఇవ్వండి మళ్లీ ఇస్తాను' అని కొందరు నాయకులు తమ వసూళ్ల పర్వానికి తెరలేపారు. పథకాలకు సాయం చేసి కమీషన్ రూపంలో డబ్బులు వసూలు చేస్తే బద్నాం అవుతామనే ఉద్దేశ్యంతో మరో ఎత్తుగడ వేసి చేబదులు రూపంలో డబ్బులు తీసుకుంటున్నట్లు వెలుగులోకి వచ్చింది. చేబదులుగా తీసుకున్న డబ్బు వాపసు ఇవ్వకుండా లబ్ధిదారులను ఇబ్బంది పెడుతున్న నాయకుల తీరు వివాదాస్పదమైంది. మోర్తాడ్ మండలంలోని వివిధ గ్రామాల్లో కల్యాణలక్ష్మి, షాదీముబారక్ లబ్ధిదారుల నుంచి ఇద్దరు, ముగ్గురు నాయకులు తమ వసూళ్ల తంతును నిరంతరం కొనసాగిస్తూనే ఉన్నారు. కమీషన్‌గా తీసుకుంటే చెడ్డపేరు వస్తుందని భావించి చేబదులు రూపంలో డబ్బులు తీసుకుని తమ జేబులు నింపుకుంటున్నారు. మండలంలోని ఒక మేజర్ గ్రామ పంచాయతీ పరిధిలో నాయకుడు ఒకరు పదిమంది లబ్ధిదారుల నుంచి చేబదులు రూపంలో సొమ్ము తీసుకున్న సొమ్మును వాపసు ఇవ్వకపోవడంతో లబ్ధిదారులు బహిరంగంగానే అడిగినట్లు తెలుస్తుంది. కొందరు నాయకులు తమ వసూళ్లను యథేచ్ఛగా కొనసాగిస్తున్నా అగ్రనాయకులు మాత్రం నోరు మెదపకపోవడం అనేక అనుమానాలకు తావిస్తుంది. కల్యాణలక్ష్మి, షాదీముబారక్‌ల లబ్ధిదారుల నుంచి వసూళ్లు చేస్తున్న నాయకుల తీరుపై సమగ్ర విచారణ జరిపితే వాస్తవాలు వెలుగులోకి వచ్చే అవకాశం ఉంది.

క్రైం కార్నర్

సిద్ధివినాయక కాలనీలో చోరీకి యత్నం

ఖలీల్‌వాడి: నగరంలోని నాల్గోటౌన్ పోలీస్‌స్టేషన్ పరిధిలోని సిద్ధివినాయకకాలనీలో చోరీకి యత్నించినట్లు స్థానికుల ద్వారా తెలిసింది. శనివారం అర్ధరాత్రి సమయంలో వచ్చిన దొంగలు నాలుగు ఇళ్లలో చోరీకి యత్నించగా స్థానికులు కేకలు వేయడంతో పరారయ్యారు. చోరీకి వచ్చినట్లు సీసీ టీవీ ఫుటేజీలో రికార్డయినట్లు సమాచారం.

సాయిబాబా ఆలయంలో..

లింగంపేట(ఎల్లారెడ్డి): మండల కేంద్రంలోని సాయిబాబా ఆలయంలో ఆదివారం తెల్లవారు జామున గుర్తు తెలియని వ్యక్తి చోరీకి యత్నించినట్లు ఎస్సై ప్రభాకర్ తెలిపారు. ఆలయ పూజారి సుధాకర్ కులకర్ణి శనివారం రాత్రి 10 గంటలకు ఆలయానికి తాళం వేసి వెళ్లారు. ఉదయం 5గంటలకు పూజారి భార్య మంగల కులకర్ణి ఆలయం గేటు తాళం తీసేందుకు వెళ్లగా అక్కడ అనుమానాస్పదంగా వ్యక్తి కనిపించడంతో కేకలు వేసింది. దీంతో ఆ వ్యక్తి పారిపోయాడు. ఆలయం లోపలికి వెళ్లి చూడగా లోపల హుండీని పగలగొట్టేందుకు ప్రయత్నించినట్లు ఉంది. ఆలయ నిర్వాహకుడు సుధాకర్ కులకర్ణి ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసినట్లు పోలీసులు తెలిపారు.

ఒకరి అదృశ్యం



వడ్ల కాశీరాం

లింగంపేట(ఎల్లారెడ్డి): మండలంలోని శెట్పల్లి గ్రామానికి చెందిన వడ్ల కాశీరాం అదృశ్యమైనట్లు గ్రామస్తులు తెలిపారు. కాశీరాం(50) ఈనెల 17వ తేదీన మధ్యాహ్నం మూడు గంటలకు ఇంటి నుంచి వెళ్లినట్లు కుటుంబ సభ్యులు తెలిపారు. అప్పటి నుంచి మూడు రోజులుగా వెతికినా దొరకకపోవడంతో ఆయన కుటుంబీకులు హైదరాబాద్‌లోని సూరారం పోలీస్ స్టేషన్‌లో ఆదివారం ఫిర్యాదు చేశారు. కాశీరాం కనిపిస్తే ఉదయ్‌గౌడ్‌కు 7815899061 సమాచారం ఇవ్వాలని వారు కోరారు.

కుటుంబ కలహాలతో మహిళ ఆత్మహత్య

మోపాల్(నిజామాబాద్‌రూరల్): మండలకేంద్రానికి చెందిన దమ్మిడి మమత (32) ఆదివారం తాడెం చెరువులో దూకి ఆత్మహత్య చేసుకుంది. గ్రామస్తులు తెలిపిన వివరాల ప్రకారం మమతకు నరేష్‌తో కొన్నేళ్ల క్రితం వివాహమైంది. నరేష్ మోపాల్‌కు ఇల్లరికం వచ్చాడు. వారికి ముగ్గురు కుమార్తెలు. కూలీ పని చేసుకుంటూ కుటుంబాన్ని నెట్టుకొస్తున్నారు. గత కొన్ని రోజులుగా ఇద్దరికి గొడవలు జరుగుతున్నాయి. తాజాగా మూడ్రోజుల క్రితం గొడవ జరగగా, మమత ఇంట్లో నుంచి వెళ్లిపోయింది. కుటుంబ కలహాలతో విరక్తి చెందిన ఆమె తాడెం చెరువులో దూకి ఆత్మహత్య చేసుకుంది. కుటుంబీకుల ఫిర్యాదు మేరకు మృతదేహానికి పంచనామ నిర్వహించి పోస్టుమార్టం నిమిత్తం జిల్లాకేంద్రాసుపత్రికి తరలించారు.

తల్లీకూతుళ్ల అదృశ్యం

జక్రాన్‌పల్లి: జక్రాన్‌పల్లి మండల కేంద్రంలో తల్లీకూతుళ్లు అదృశ్యమైనట్లు ఎస్సై తిరుపతి తెలిపారు. ఎస్సై తెలిపిన వివరాల ప్రకారం జక్రాన్‌పల్లికి చెందిన గాజనవెల్లి శిరీషా తన పెద్ద కూతురు ప్రతిమతో కలిసి శనివారం సాయంత్రం వీక్లీ మార్కెట్‌కు వెళ్లిందని తెలిపారు. మార్కెట్‌కు వెళ్లిన తల్లి శిరీషా, కూతురు ప్రతిమ ఇద్దరూ ఇంటికి తిరిగి రాలేదన్నారు. బంధువుల ఇళ్లలో వెతికినా ఆచూకీ లభించకపోవడంతో భర్త నర్సింగ్ ఆదివారం పోలీసులకు ఫిర్యాదు చేశాడు. భర్త ఇచ్చిన ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసుకుని దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్సై తెలిపారు.

విద్యుత్‌షాక్‌తో యువకుడి మృతి



ముఫాసిల్ మృతదేహం

బాల్కొండ: బాల్కొండ మండల కేంద్ర శివారులో జాతీయ రహదారి 44 పక్కన ఉన్న మాధవి సిమెంట్ పైపుల తయారీ కంపెనీలో క్రెయిన్ ఆపరేటర్ నిర్లక్ష్యం కారణంగా విద్యుత్తు షాక్ తగిలి బాల్కొండ మండల కేంద్రానికి చెందిన ఎండీ ముఫాసిల్(19) మృతి చెందాడు. బాల్కొండ ఎస్సై గోపి తెలిపిన వివరాల ప్రకారం.. ట్రాలీ ఆటో నడుపుకుంటూ జీవనం సాగిస్తున్న ముఫాసిల్ గిరాకీ కోసం సిమెంట్ పైపుల కంపెనీ నుంచి పైపులు తీసుకురావడానికి ఆదివారం వెళ్లాడు. కంపెనీలో క్రెయిన్ ఆపరేటర్ పైపులను ఎత్తేందుకు క్రేయిన్‌కు ఉన్న ఇనుప కొండీని తగిలించాలని సూచించాడు. కాని క్రేయిన్ 11 కేవీ విద్యుత్ లైన్ కింద ఉన్న విషయాన్ని మరిచాడు. దీంతో క్రేయిన్‌కు ఉన్న ఇనుప కొండీని పట్టుకోగానే ముఫాసిల్‌కు విద్యుత్ షాక్ తగిలి కుప్పకూలాడు. వెంటనే అక్కడ ఉన్న కార్మికులు గమనించి ఆర్మూర్‌లోని ఓ ప్రైవేట్ ఆస్పత్రికి తరలించారు. అప్పటికే మృతి చెందినట్లు వైద్యులు తెలిపారు. బాల్కొండ పోలీసులు కేసు నమోదు చేసుకుని దర్యాప్తు చేస్తున్నారు. మృతుడికి వివాహం కాలేదని స్థానికులు తెలిపారు.

వాహనం ఢీకొని వృద్ధురాలు..



వృద్ధురాలి మృతదేహం

ఆర్మూర్‌టౌన్: ఆర్మూర్ పట్టణంలోని ఆర్టీసీ బస్టాండ్ సమీపంలో ఆదివారం ఉదయం జరిగిన రోడ్డు ప్రమాదంలో గుర్తు తెలియని వృద్ధురాలు చికిత్స పొందుతూ మృతి చెందినట్లు ఎస్సై గంగాధర్ తెలిపారు. పోలీసులు తెల్పిన వివరాల ప్రకారం ఆర్టీసీ బస్టాండ్ సమీపంలో ఐచర్ వాహనం అదుపుతప్పి వృద్ధురాలికి ఢీకొట్టగా ఆమె కాలు విరిగి నుజ్జునుజ్జయ్యింది. అక్కడే పనిచేస్తున్న మున్సిపల్ పారిశుద్ధ్య కార్మికులు 108కు సమాచారం అందించి జిల్లా ప్రభుత్వ ఆస్పత్రికి తరలించారు. కాగా వృద్ధురాలు చికిత్స పొందుతూ మృతిచెందినట్లు ఎస్సై గంగాధర్ తెలిపారు. వృద్ధురాలి వయస్సు 50 నుంచి 60 మధ్యలో ఉంటుందన్నారు. మృతదేహాన్ని జిల్లా ఆస్పత్రిలో మార్చురీలో భద్రపర్చారని, సంబంధింకులు ఎవరైన ఉంటే ఆర్మూర్ పీఎస్‌లో సంప్రదించాలన్నారు.

పందుల కోసం ఘర్షణ: ఒకరి మృతి

రెంజల్(బోధన్): పందుల కోసం జరిగిన ఘర్షణలో తీవ్రంగా గాయపడిన యువకుడు చికిత్స పొందుతూ ఆదివారం జిల్లా కేంద్రంలోని ఆస్పత్రిలో చికిత్స పొందుతూ మృతిచెందాడు. ఎస్సై ఉదయ్‌కుమార్ తెలిపిన వివరాల ప్రకారం బోధన్ పట్టణానికి చెందిన కెంబసర్ది వెంకట్ అలియాస్ నాగరాజు(32) అతని స్నేహితులతో కలిసి శుక్రవారం రెంజల్ బస్టాండ్‌లో పందులను పట్టుకునేందుకు వచ్చారు. బస్టాండ్‌లో దొరికిన పందులను తీసుకుని పోతుండగా విషయం తెలుసుకున్న సాటాపూర్ గ్రామానికి చెందిన కొందరు వచ్చి వారిని అడ్డుకున్నారన్నారు. ఇరువురి మధ్య వాగ్వాదం చోటు చేసుకుని ఘర్షణకు దారితీసిందన్నారు. దాడిలో గాయపడిన నాగరాజ్‌ను అతని స్నేహితులు నిజామాబాద్‌లోని ఆస్పత్రిలో చేర్పించారని ఎస్సై పేర్కొన్నారు. శనివారం నాగరాజు సోదరుడు అశోక్ సాటాపూర్‌కు చెందిన హన్మంతు, గంగాధర్, శంకర్‌లతో పాటు మరి కొందరిపై ఫిర్యాదు చేశారని వివరించారు. ఆదివారం చికిత్స పొందుతూ నాగరాజు మృతిచెందినట్లు తెలిపారు. కుటుంబీకుల ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి విచారిస్తున్నట్లు పేర్కొన్నారు.

అప్పు తీర్చలేదని.. అడవిలోకి తీసుకెళ్లి దాడి



గాయాలు చూపిస్తున్న సాయిలు

ఖలీల్‌వాడి: అప్పుతీర్చడం లేదని నగర శివారులోని మల్లారం అటవీ ప్రాంతానికి తీసుకెళ్లి తండ్రీ, ఇద్దరు కొడుకులు కలిసి ఓ వ్యక్తిని చితకబాదిన సంఘటన ఆదివారం నిజామాబాద్ రూరల్ మండలంలో చోటుచేసుకుంది. స్థానికుల కథనం ప్రకారం నిజామాబాద్ రూరల్ మండలంలోని కొత్తపేట్‌కు చెందిన మంగలి సాయిలు మల్కాపూర్ తండాకు చెందిన కమల్‌చంద్ వద్ద రూ. 15 వేలు అప్పు తీసుకున్నాడు. సాయిలు రియల్ ఎస్టేట్ వ్యాపారం చేస్తూ.. కమల్‌చంద్‌కు చెందిన భూమిని అమ్మేసేలా సహాయం చేశాడు. అప్పు ముట్టిందని వారు ఒప్పుకున్నాడు. కాని కొన్నిరోజులకు రూ. 15 వేలు అప్పు తీర్చాలని ఒత్తిడి చేసి సాయిలు బైక్‌ను కమల్‌చంద్ వర్గీయులు తీసుకెళ్లాడు. ఆదివారం ఉదయం అప్పు విషయమై మాట్లాడాలని పిలిపించిన కమల్‌చంద్, ఇద్దరు కుమారులు వికాస్, సురేష్ మల్లారం అటవీ ప్రాంతానికి తీసుకెళ్లి చితకబాదారు. బాధితుడు రూరల్ పోలీసులకు ఫిర్యాదు చేసినట్లు సమాచారం.

చెరువులో పడి వృద్ధురాలి మృతి

మోపాల్(నిజామాబాద్‌రూరల్): మండలకేంద్రంలోని చెరువులో ప్రమాదవశాత్తు పడి గ్రామానికి చెందిన సాకలి చిన్నుబాయి (60) మృతిచెందినట్లు ఏఎస్సై దయాల్‌సింగ్ ఆదివారం తెలిపారు. చిన్నుబాయి దుస్తులు ఉతికేందుకు శనివారం చెరువుకు వెళ్లింది. దుస్తులు ఉతికిన తర్వాత స్నానం చేసేందుకు చెరువులోకి దిగింది. ప్రమాదవశాత్తు జారి పడి మునిగిపోయింది. ఆదివారం మృతదేహం తేలడంతో పోలీసులు సంఘటనాస్థలానికి చేరుకుని పంచనామా నిర్వహించారు. మృతురాలి చెల్లెలు కుమార్తె స్వప్న ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసుకున్నట్లు ఏఎస్సై తెలిపారు. చిన్నుబాయికి కుమారుడు ఉన్నారు. ప్రస్తుతం ముంబాయిలో ఉన్నాడు.

చేపల వేటకు వెళ్లి ఒకరు..

మాక్లూర్: చేపల వేటకు వెళ్లి ఒకరు మృతి చెందిన సంఘటన ఆదివారం మండలంలోని బొంకన్‌పల్లి చెక్ డ్యాంలో జరిగింది. మాక్లూర్ ఎస్సై సుధీర్‌రావు కథనం మేరకు నిజామాబాద్ రూరల్‌లోని పాల్దాకు చెందిన మల్కన్న (46) శనివారం సాయంత్రం చేపల వేటకోసం సమీపంలో ఉన్న చెక్‌డ్యాంకు వెళ్లాడు. సాయంత్రం వరకు తిరిగిరాకపోవడంతో కుటుంబసభ్యులు డ్యాం వద్దకు వెళ్లగా అక్కడ మల్కన్న దుస్తులు, చెప్పులు కనిపించాయి. ప్రమాదవశాత్తు నీటిలో గల్లంతైనట్లు గుర్తించి గాలించగా ఆదివారం ఉదయం మల్కన్న మృతదేహం లభ్యమైంది. భార్య సాయమ్మ ఫిర్యాదు ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసినట్లు ఎస్సై తెలిపారు.

చెరువులో పడి ఒకరు..



లింగంపేట(ఎల్లారెడ్డి): మండలంలోని శెట్పల్లిసంగారెడ్డి గ్రామానికి చెందిన సిద్దరాంరెడ్డి(47) ఊర చెరువులో ప్రమాదవశాత్తు మునిగి మృతి చెందినట్లు ఎస్సై ప్రభాకర్ తెలిపారు. మృతుడు సిద్దరాంరెడ్డి తన కుటుంబీకులతో హైదరాబాదులోని సూరారంకు 15ఏళ్ల క్రితం వలస వెళ్లాడు. ఆయనకు భార్య సునీత, ఇద్దరు కూతుర్లు భవాని, శ్రావణి ఉన్నారు. సిద్దరాంరెడ్డి వారం క్రితం తల్లిని చూసేందుకు కుటుంబీకులతో కలిసి షెట్పల్లిసంగారెడ్డికి వచ్చాడు. శనివారం గ్రామ శివారులోని ఊర చెరువుకు కాల కృత్యాలు తీర్చుకోవడానికి వెళ్లి ప్రమాదవశాత్తు నీటిలో పడి మృతి చెందాడు. ఆదివారం చెరువులో మృతదేహం తేలగా కుటుంబ సభ్యులు గుర్తించారు. పోలీసులు సంఘటనాస్థలానికి చేరుకుని భార్య లలిత ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసుకున్నారు.